
# కాశ్మీర సిల్కుచీర



కొమ్మిడి మత్స్యేంద్రరెడ్డి

"ఏమండీ !" మంచినీళ్ళ చెంబు టేబులుపై పెట్టి గోముగా పిలిచింది గిరిజ.

చదువుతున్న పుస్తకంలోని పేజీని గుర్తుగా మడచి పక్కన పడేస్తూ భార్య వేపు చూశాడు మాధవ. కళ్ళు పత్తి కాయలంత చేసుకుని మరీ చూశాడు. గులాబీరంగు శరీరానికి తెల్లని చీరను అదేదో అడ్వర్టయిజుమెంటులా కట్టుకుని- మరింత తెల్లని మల్లెలను అలవోకగా సిగలో తురుముకుని, అప్పుడే దివినుండి భువికి దిగివచ్చిన అప్సరసలా వెలిగిపోతూంది గిరిజ. ఆ క్షణం మత్తెక్కి మతి పోయినంత పనయింది.

"ఏమండీ !" మంచంపై కూర్చుని, షర్టుగుండీలను మెలిపెడ్తూ మళ్ళీ మరింత గోముగా పిలిచింది.

అప్పటికే వుక్కిరిబిక్కిరయిపోతున్న మాధవ మరింతగా కదిలిపోయాడా మాటలకు. "అబ్బ ! ఏమిటో చెబుదూ!" నడుంపై చేయి వేసి గుండెలపైకి లాక్కుంటూ త్వరత్వరగా అడిగాడు.

"ఏం లేదు ! ఈ పండక్కి చీర కావాలండీ ! కాశ్మీరు సిల్కు చీర !" షర్టు గుండీలు విప్పి గుండెల్లో గుసగుసలాడింది.

అప్పటికే పూర్తిగా వశంతప్పిన మాధవ తనేం మాట్లాడుతున్నాడో తనకే తెలియక "ఓకె ! డార్లింగ్ ! ఈ రోజు ఫెస్టివల్ ఎడ్వాన్స్ రెండొందలు తెచ్చిచ్చానే. అవి పెట్టి కొనుక్కో !" గ్రాంటు చేసేశాడు. ఆ చీర రెండొందలు దాటుతుందని, ఇంటి ఖర్చులకిచ్చిన బాపతులోంచి మరికొంత లాక్కుపోతుందనే విషయం ఆ సమయంలో గుర్తుకు రాక.

సంతోషంతో ఏదో అనాలని తలెత్తబోయింది గిరిజ. కాని ఎత్తనీయలేదు మాధవ.

పడకుర్చీలో వాలిపోయి గతరాత్రి మధురానుభూతుల మానస గీతం మైమరచిపోయి వింటూన్న మాధవ ఒక్కసారిగా వులిక్కిపడ్డాడు.

పక్కవాటాలో ఏవో గుసగుసలు..

హాలులో సగం పైకే లేచివున్న చెక్క పార్టీషను అవతల భాగంలో ఏవో బుస బుసలు. ఏవరినో మర్దరు చేసేవాళ్ళు కుట్ర పన్నుతున్నట్లు

"పండక్కి కొత్త చీర కొనరా" వేడుకోలుతో మిళితమైన బెదిరింపు-

"ఎలా కొనమంటావే ఫెస్టివల్ ఎడ్వాన్సు కూడా ఏడాది మొదట్లోనే తన్నేశానుగా మళ్ళీ ఇప్పుడెవడిస్తాడే అందులోనూ కాశ్మీరు సిల్కు చీరంటున్నావు. పక్కింటావిడ కొంటే మాత్రం నీవూ కొనాలా ?" అర్థింపులో కలిసిపోయి వెలువడ్డ కసిరింపు-

నిండుగా నీళ్ళు నిండిన ఏదో మాట.

"అబ్బ వూరుకోవే అసలే చిక్కులతో వూపిరి మెసలక ఛస్తూంటే"

నిండిన నీళ్ళను క్రిందికి ఒలక బోస్తున్న చప్పుడు.

"సరె సరే ఒక వుపాయం చెప్పనా"

కుళాయి పంపు కట్టేసినట్టు ఒక్క సారిగా ఆగిన నీళ్ళు.

"మీ అమ్మ చావుబ్రతుకుల్లో వుందని అర్జంటుగా బెజవాడ వెళ్ళాలని పక్కింటావిడను రెండొందలడుగు రాగానే ఇచ్చేస్తానని ప్రామిస్ చేసెయ్యి వాటితో చీర కొనుక్కో ఆపై విషయం తర్వాత చూద్దాం"

"బెజవాడ వెళ్ళకుండా కొత్త చీర కట్టుకుని ఇక్కడే వుంటే ఆమె వూరుకుంటుందా. పట్టుకుని తన్నదూ" ధర్మసందేహం.

"ఇక్కడెందుకుంటావే. మలక పేటలో వున్న మీ అక్కగారింటి కెళ్ళావు పండక్కి నేనూ అక్కడికే చేరుకుంటాను. మధ్యాహ్నానికి ప్రయాణం కట్టేయి" సందేహ నివృత్తి.

ప్రాబ్లెం సాల్వయినట్లు నిశ్శబ్దం.

గుక్కబట్టుకుని అన్నీ వింటున్న మాధవ గుండెలు విపరీతంగా కొట్టుకో సాగినయి. "అబ్బా! దొంగ ముండా కొడుకా! ఎంత ప్లాను వేశావురా వీడినసలు ప్లానింగ్ కమిషను ఛైర్మనుగా అప్పాయింటు వెయాల్సింది దొంగ రాస్కెల్ వెంటనే గిరిజను హెచ్చరించాలి లేకుంటే కొంప మునుగుతుంది—"


"మాధవగారూ"

"ఆఁ ఎవరూ రండి"

తలుపుల్ని తోసుకుని వెనకనుండి ఎవరో తన్నినట్లుగా లోనికొచ్చిపడ్డాడు రాజు. వెనువెంటే శేషు, భాస్కరం, మహమ్మదు

"ఏమిటో నాయకులంతా హుటా హుటిన దండెత్తారు" అందరూ కూర్చునాక అడిగాడు మాధవ.

"ఏంలేదోయ్! రాజును మన యూనియన్ జనరల్ సెక్రటరీగా నామినేషను వేయమంటున్నాము. ఆ విషయాలే



మాట్లాడదామని " సిగరెట్టు వెలిగిస్తూ చెప్పాడు శేషు.

"మైనారిటీ వర్గం నుండి మహమ్మదును వైస్-ప్రెసిడెంటుగా నిలబెడ్తే మ్యూచుయల్ సపోర్టు చేసుకోవచ్చు!" రాజకీయాల్లో కొమ్ములుతిరిగిన భాస్కర్ ఉవాచ.

"సంతోషం నా సపోర్టు ఈ పేనల్‌కే వుంటుంది!" వాగ్దానం చేశాడు మాధవ.

అలా ఆఫీసువిషయాలూ ఎన్నికల మెళకువలూ చర్చిస్తూ ఆఫీసు టైమయేదాకా కూర్చుండిపోయారు. తీరా టైమయినాక "పదవోయ్... ఇంకా చాలామందికి కాంటాక్టు చేయాలి. లంచ్ బయటనే ఎరేంజ్ చేశాము!" అగ్గిపుల్లతో మొదట మాధవలోని ఆశాజ్యోతిని ముట్టించి ఆ తర్వాత తాపీగా సిగరెట్టంటించుకున్నాడు శేషు.

అప్పటికే చికెను బిరియానీ సువాసనతో ముక్కుపుటాలు నిండిపోయినట్లయి వుక్కిరిబిక్కిరయిపోయాడు మాధవ. ఇంకేమీ ఆలోచించక గబగబా బట్టలు మార్చుకుని గభాల్న వీధిన బడ్డాడు అందరితోబాటూ.

మధ్యాహ్నం రెండు గంటల ప్రాంతంలో టూరిస్టు బారులో చికెన్ బిరియానీని-బీరుతో కలిపి మరీ పట్టించి, బారువాడు కాంప్లిమెంటరీగా యిచ్చిన సన్నని పుల్లను పండ్లమధ్య ఇరికించుకుని బయటకొచ్చిన మాధవ మరుక్షణం అదిరిపోయాడు ఎదురుగా బస్సుస్టాపులో రెపరెపలాడుతున్న కాశ్మీరు సిల్కు-చీరను చూస్తూనే.

ఉదయం పక్కవాటాలో జరిగిన భయంకరమైన కుట్ర ఫ్లాష్‌బ్యాక్‌లా గుర్తుకొచ్చి ఒళ్ళంతా కంపరమెత్తింది. అంత చల్లదనంలోనూ నుదురుపై సన్నని చెమట పట్టింది. వాచీ చూసుకున్నాడు. రెండున్నర కావస్తూంది.

"ఏమిటోయ్ వాటీజ్ ద మేటర్?" అతని కంగారును కనిపెట్టిన శేషు అడిగాడు.

"ఏమీ లేదు. ఇంటివద్ద అర్జంటు పనివుంది. ఇప్పుడే గుర్తొచ్చింది నేను మళ్ళీ కలుస్తాను" అంటూనే సైకిలుపైకి బంతిలా ఎగిరి కూర్చుని రివ్వున పోనిచ్చాడు. అదే వేగంలో ఇల్లు చేరుకుని స్టాండు కూడా వేయకుండా సైకిలును క్రింద పడవేసి లోనికి పరుగెత్తాడు.

అతను ముందే సుష్టుగా భోంచేయడం మూలాన పైగా అతివేగంగా సైకిలుపై దూసుకురావడం మూలాన విపరీతంగా దమ్ముతీస్తున్న భర్తను చూస్తూనే దిమ్మెరబోయింది గిరిజ. "ఏమిటండీ ఏమయింది" ఏదో జరగకూడనిదే జరిగిపోయివుండవచ్చనే అనుమానంతో అప్పటికే కన్నీరు పొంగిపోతుంటే గాభరాగా అడిగింది.

"ఏమీ లేదు పక్కింటావిడ అదే పక్కింటి సీత ఇంట్లో నే వుందా?" ఇంకా తేరుకోకుండానే అడిగాడు.

"ఎందుకండీ వాళ్ళమ్మగారికి సీరియస్‌గా వుందని టెలిగ్రాం వచ్చిందట. అరగంట క్రితమే బెజవాడ వెళ్ళింది!" ఏడుపు కంఠంతో చెప్పింది.

ఆ మాటలు వినగానే, హార్టెటాక్ వచ్చినట్టయి గుండెలను దిట్టగా పట్టుకుని మంచంపై కూలబడిపోయాడు మాధవ.

అది చూసిన గిరిజ మరీ కంగారుపడిపోయింది. "ఏమిటండీ యిది ఏమయింది? డాక్టరు వద్దకు వెళ్దామా" కన్నీరు జలజలా రాలిపోతుంటే భర్త గుండెలు రాస్తూ అడిగింది-

ఆ మాటలకు చిర్రెత్తిపోయాడు మాధవ. "ఏం! డాక్టరు వద్దకెందుకూ చచ్చేందుకా? ఇంతకీ పక్కింటావిడ డబ్బులేమైనా అడిగిందా" కసురుకుంటూనే అడిగాడు.

"అఁ పాపం! వాళ్ళమ్మకు సీరియస్‌గా వుందంటే"

ఆమె మాటలు పూర్తికాకముందే "రెండొందలు యిచ్చావు అంతేనా? పిచ్చి వెధవా ఆ దొంగముండ వెళ్ళింది బెజవాడ కాదే మలకపేట వెళ్ళింది ఆ డబ్బు కాశ్మీరు సిల్కుచీర కోసం ఎత్తుకుపోయింది"

ఆ మాటలు వింటున్న గిరిజ అలాగే నోరు తెరుచుకుని చూస్తూండిపోయింది. క్షణం క్రితం భర్తకోసం కారిన కన్నీరు వెంటనే రంగుమారి కాశ్మీరు సిల్కుచీర కోసం రాలసాగింది.